## 'కాళోజీ అవార్డు' కమిటీ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మక 'కాళోజీ నారాయణరావు అవార్డు'కు అ ర్హులైన సాహితీవేత్తను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి న కమిటీ మొదటి సమావేశం మంగళవారం కమిటీ అధ్యక్షుడు అందెశ్రీ అధ్యక్షతన జరిగిన సచివాలయంలో జరిగింది. కమిటీ సభ్యులు ఏనుగు నర్సింహా రెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పొట్లపల్లి శ్రీనివాస్, మెంబర్ కన్వీనర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నా రు. కాళోజీ నారాయణరావు పేరుమీద ఏటా సాహితీ అవార్డు కింద గ్రహీతను సన్మానించి, జ్ఞాపికతో పా టు రూ.1,01,116 అందజేస్తారు. ఈ అవార్డుకు 40 మంది సాహితీవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు.

## 76 మంది నాయబ్ తహసీల్దార్లకు ప్రమోషన్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 76 మంది నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మల్టీజోన్ -1 పరిధిలో 37 మంది, మల్టీజోన్-2 పరిధిలో 39 మంది ఉన్నారు. వారికి జిల్లాలను కూడా కేటాయించారు.

## మిడ్‌వైఫరీలకు పోస్టింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): 343 మంది మిడ్‌వైఫరీలకు వైద్యారోగ్య శాఖ పోస్టింగులు ఇస్తూ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసవాలు అధికంగా నమోదయ్యే దవాఖానలు, వైద్యులు అందుబాటులో లేని ప్రాంతాల్లో నర్సులు పురుడు పోసేలా గత ప్రభుత్వం 'నర్స్ ప్రాక్టీషనర్స్ ఇన్ మిడ్‌వైఫరీ' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, నర్సులకు శిక్షణ ఇచ్చింది. 354 మందికి శిక్షణ ఇవ్వగా, ఇందులో ఏడుగురు ఇప్పటికే గురుకులాల్లో నియమితులు కాగా, ఒక ఎన్‌పీఎం మరణించారు. మరో ముగ్గురు ఎంఈలుగా శిక్షణ పొందుతున్నారు. మిగతా 343 మందిని జిల్లాలకు కేటాయించారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, దాసోజు శ్రవణ్, పల్లె రవికుమార్

# రౌడీయిజంతో కాంగ్రెస్ పాలన

- సహాయక చర్యలను ప్రశ్నిస్తే దాడులా?
- రాష్ట్రంలో ప్రశాంతతను చెడగొడుతున్నరు
- జనం వరదల్లో ఉంటే సీఎం 'సినిమా' చూస్తారా?
- మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ రౌడీయిజంతో పాలించాలని చూస్తున్నదని మాజీ మంత్రి మహబూబ్ అలీ మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో దేశంలో ఏరాష్ట్రంలోనూ లేని విధంగా గంగా జమునా తహెజీబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వాతావరణాన్ని చెడగొట్టాలని కంకణం కట్టుకున్నదని విమర్శించారు. తమ హయాంలో ఎక్కడా కాంగ్రెస్ నేతలపై దాడులకు పాల్పడలేదని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌తో కలిసి మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్ బృందంపై దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరద సహాయక చర్యల్లో పాల్గొంటే దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు.

### రాష్ట్రం ఎటుపోతున్నదో : శ్రీనివాస్‌గౌడ్

ప్రజలు వరదల్లో ఉంటే సీఎం రేవంత్‌రెడ్డికి సినిమా చూసే తీరిక దొరికిందా? అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవాచేశారు. సహాయక చర్యలు ఏపీలో ఒకలా తెలంగాణలో మరోలా ఉన్నాయని, తెలంగాణలో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్‌ఎస్ బృందం వరద బాధితులకు సహాయం చేద్దామని వెళ్తే కాంగ్రెస్ గూండాలు రాళ్లతో దాడికి తెగబడ్డారని, ఈ పరిణామాలను చూస్తుంటే రాష్ట్రం ఎటుపోతుందో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు కార్యాలయంపై ఉద్దేశపూర్వకంగా దాడిచేశారని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవాళ్లు దాడులకు భయపడరనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవుపలిరు. దాడులతో బీఆర్‌ఎస్‌ను కంట్రోల్ చేయాలనుకుంటే పొరపాటేనని చెప్పారు. దాడులు బీఆర్‌ఎస్ సంస్కృతి కాదని, రాష్ట్రంలో రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తే కేసీఆర్ ప్రభుత్వం బందోబస్తు కల్పించిందని, సీఎల్పీ లీడర్‌గా భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తే ఎక్కడా ఆటంకాలు కలిగించలేదని ఉదహరించారు.

### రాష్ట్రంలో ప్రతీకార పాలన : బాల్కసుమన్

రాష్ట్రంలో సాగుతున్నది ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలన అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించేందుకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ బృందం వెళ్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయమెందుకని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతల పర్యటనలో ప్రజల స్పందన చూసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డికి వణుకు పుట్టిందని ఎద్దేవా చేశారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ గూండాలు దాడులకు దిగారంటే రాష్ట్రంలో పాలన ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతున్నదని ధ్వజమెత్తారు. గత ఆదివారం భారీ వర్షాలతో రాష్ట్రం ఆగమైపోతుంటే తన కుటుంబ సభ్యులతో సినిమాకు వెళ్లిన సీఎంకు రాష్ట్ర ప్రజలపై ఏ మేరకు ప్రేమ ఉన్నదో తెలిసిపోతున్నదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ నేతలు క్షేత్రస్థాయికి వెళ్తే రాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్నారని, తెలంగాణను బీహార్‌లా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నట్టు ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని మండిపడ్డారు. ఖమ్మం పర్యటనను సీఎం ఎన్నికల ప్రచారంలా వాడుకున్నారని విమర్శించారు.


### రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు : బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్

వర్షాలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ప్రజలను ఆదుకోవటంలో సీఎం దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ప్రధాన ప్రతిపక్షంగా వెళ్లిన వారిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నీచ మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నేతలను లేకుండా చేయాలని ముఖ్యమంత్రి కుట్ర పన్నుతున్నట్టు జరుగుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయని ఆరోపించారు. తమ కళ్లెదుటే దాడులు జరుగుతుంటే పోలీసులు ఎందుకు సైలెంట్‌గా ఉన్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల విలాసాలకు, పుట్టిన రోజులను హెలికాప్టర్లు దొరుకుతాయి కాని, ప్రజలను కాపాడేందుకు దొరకవా? అని నిప్పులు చెరిగారు.

- 'వరద హీరోలకు' బీఆర్‌ఎస్ నేతల సన్మానం

*మున్నేరు వరదల్లో ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపైన చిక్కుకున్న 9 మందిని తాడు, జేసీబీ సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఆరుగురు వరద హీరోలను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఖమ్మం నగర పర్యటనకు వచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు.. జేసీబీ ఓనర్ వెంకటరమణ, జేసీబీ డ్రైవర్ ఎస్‌కే సుభాన్, మొర్రిమేకల ఉపేందర్, మొర్రిమేకల జవహర్‌లాల్, నాగేశ్వరరావు, జీ వెంకటేశ్వరరావులను శాలువాలతో సత్కరించి అభినందించారు.*

-ఖమ్మం






ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మంత్రి శ్రీధర్‌బాబు కాళ్లు మొక్కుతున్న ప్రాజెక్టు గేట్ ఆపరేటర్ లక్ష్మణ్

## కాళ్మొక్త సార్.. జీతాలియ్యండి

**మంత్రి శ్రీధర్‌బాబుకు ఎల్లంపల్లి గేట్ ఆపరేటర్ వినతి**

హాజీపూర్, సెప్టెంబర్ 3 : 'సార్.. మాకు ఆరు నెలల నుంచి జీతాలు సరిగా ఇవ్వడం లేదు. ఇబ్బందిగా ఉన్నది. దయచేసి ప్రతి నెలా జీతాలు ఇచ్చేలా చూడండి' అంటూ ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్ ఆపరేటర్ మంత్రి శ్రీధర్‌బాబు కాళ్లపై పడి వేడుకున్నాడు. మంగళవారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల గుడిపేట పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు రాగా గేట్ ఆపరేటర్ లక్ష్మణ్ ఆయనతో మొరపెట్టుకున్నాడు. ఎల్లంపల్లిలో మొత్తం తొమ్మిది మంది కాంట్రాక్టు గేట్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు ఆరు నెలలుగా బిల్లులు వస్త లేవని వేతనాలను చెల్లించడం లేదని మంత్రి ఎదుట వాపోయాడు. ఒక వేళ వేతనాలు ఇచ్చినా ఏడుగురికి సరిపడా వేతనాలు ఇచ్చి 9 మంది తీసుకోవాలని అధికారులంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని అక్కడున్న ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు.

## రాత్రికి రాత్రే నేలకూలిన 50 వేల వృక్షాలు

- ఏటూరునాగారం-మేడారం అడవుల్లో అరుదైన సంఘటన
- టోర్నడో ప్రభావం వల్లే జరిగి ఉండొచ్చంటున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం-మేడారంలోని అడవుల్లో అరుదైన సంఘటన చోటుచేసుకున్నది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అడవి తల్లి వణికిపోయింది. రాత్రికి రాత్రే 50 వేలకుపైగా చెట్లు ఒకే సమయంలో కుప్పకూలిపోయాయి. తాడిచెర్ల, తామిడేరు ప్రాంతాల్లో ఆగస్టు 31 సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. దీనిపై అటవీ, వాతావరణ శాఖల అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులతో టోర్నడోలు ఏర్పడటంతో ఈ ఘటన జరిగి ఉండొచ్చని చెప్తున్నారు. దీనిపై లోతైన పరిశీలన జరిపేందుకు శాటిలైట్ డాటాతోపాటు ఇతర పరికరాల సాయంతో అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఒకేసారి వేల సంఖ్యలో చెట్లు కూలిపోవడం ఇదే మొదటిసారని, 50 నుంచి 100 మైళ్ల వేగంతో తీవ్రమైన గాలులు వీయడం వల్ల ఈ ఘటన జరిగి ఉండవచ్చని ఆయన చెప్పారు.

## రేవంత్ సర్కార్ తాజా అప్పు 2,500 కోట్లు

**ఆర్బీఐ నుంచి 8 నెలల్లో రూ.44,618 కోట్ల రుణం**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు అప్పు కోసం మరోసారి రిజర్వు బ్యాంకు తలుపు తట్టింది. మరో రూ.2,500 కోట్లు అప్పు చేసింది. ఈ విషయాన్ని ఆర్బీఐ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.42,118 కోట్ల రుణం పొందింది. తాజాగా రూ.2,500 కోట్లతో కలిపి ఇప్పటివరకు రేవంత్‌రెడ్డి సర్కారు ఆర్బీఐ నుంచి తీసుకున్న అప్పు అక్షరాల రూ.44,618 కోట్లకు చేరింది. గత ఏడాది డిసెంబర్ 12న రూ.500 కోట్లతో మొదలు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల బాండ్ల వేలం ద్వారా ఆర్బీఐ నుంచి రుణాలు పొందుతూనే ఉన్నది. ఇలా ప్రతి నెలా రూ.5 నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి రుణాలు సేకరిస్తున్నది.

## ఆదివాసీ మహిళ పై అమానుష దాడి

మొదటిపేజీ తరువాయి...

కట్టేందుకు గత నెల 31న సిర్పూర్(యు) మండలంలోని కోహినూర్‌కు వెళ్లడానికి ఆటోల కోసం జైనూర్‌లో ఎదురు చూస్తున్నది. ఈ విషయాన్ని గమనించిన సోను పటేల్.. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం కోహినూర్‌కు వెళ్తున్నట్టు ఆమెను నమ్మించి ఆటో ఎక్కించాడు. షేక్ ముగ్దూం రాఘాపూర్ దాటగానే ఒంటరిగా ఉన్న మహిళతో అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో వాగ్వాదానికి దిగాడు. ఈ విషయం బయటికి వెళ్తే తనపై దాడి చేస్తారనుకున్న షేక్ ముగ్దూం.. ఆమె ముఖంపై ఇనుపరాడుతో బలంగా కొట్టాడు. ఆమె స్పృహ తప్పి పడిపోయింది. మహిళ చనిపోయిందనుకుని రోడ్డుపై పడేసి ఆటో డ్రైవర్ పారిపోయాడు. అటుగా వస్తున్న వాహనదారులు రక్తపు మడుగులో పడి ఉన్న మహిళను గమనించి 108లో జైనూర్ సర్కారు దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందని బాధితురాలి తమ్ముడు ఈ నెల 1న సిర్పూర్(యు) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు స్పృహలోకి రావడంతో అసలు విషయం బయట పడింది. ఈ నెల 2న పోలీసులు ఆమెను విచారించగా.. తనపై ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం లైంగిక దాడి చేయడానికి యత్నించాడని, తాను ఎదురు తిరిగితే.. తన ముఖంపై ఇనుపరాడుతో బలంగా కొట్టాడని వివరించింది. నిందితుడిపై లైంగికదాడి, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్టు ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, జైనూర్ సీఐ రమేశ్ తెలిపారు. ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన షేక్ మగ్దూంను బహిరంగంగా ఉరి తీయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకయాదవ్‌రావ్ డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు.

## ఔటర్ లోపలి గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం

మొదటిపేజీ తరువాయి...

నియమించింది. ఈ కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆగస్టు 22న సమావేశమై ఓఆర్‌ఆర్ పరిధిలోని గ్రామ పంచాయతీల మాజీ ప్రజాప్రతినిధులు, చట్ట సభల ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఔటర్‌కు అవతల ఉన్న ఆరు గ్రామ పంచాయతీలను కూడా విలీనం చేయాలని నిర్ణయించారు.

### ఆయా మున్సిపాలిటీల్లో విలీనం కానున్న గ్రామాల వివరాలు

| | మున్సిపాలిటీ | విలీనం కానున్న గ్రామాలు |
|---|---|---|
| రంగారెడ్డి జిల్లా | పెద్ద అంబర్‌పేట్ | బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతి పేట్ |
| | శంషాబాద్ | బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ , చిన్న గోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘన్సిమిగూడ. |
| | నార్సింగి | మీర్జాగూడ |
| | తుక్కుగూడ | హర్షగూడ |
| మేడ్చల్ జిల్లా | మేడ్చల్ | పోడూరు, రాయిలాపూర్. |
| | దమ్మాయిగూడ | కీసర, యాద్గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి. |
| | నాగారం | బోగారం, గూడకుంట, కరీంగూడ, రాంపల్లి, ద్యార |
| | పోచారం | వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ. |
| | ఘట్‌కేసర్ | అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనపూర్, మర్పల్లిగూడ. |
| | గుండ్లపోచంపల్లి | మునీరాబాద్, గౌడవెల్లి |
| | తూంకుంట | బొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ . |
| సంగారెడ్డి జిల్లా | తెల్లాపూర్ | కర్ధనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనపూర్. |
| | అమీన్‌పూర్ | ఐలాపూర్, ఐలాపూర్ తండా, సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ద్యార. |

# ఆర్థిక శాఖలో బిల్లుల దందా!

**చెయ్యి తడిపితేనే నిధుల విడుదల**

- పది నెలల కిందటి బిల్లులు కాదని పది రోజుల కిందటి బిల్లుకు మోక్షం
- టీచర్ల జీపీఎఫ్ పార్ట్ బిల్లుల్లోనూ దందా
- ప్రాధాన్యతను గాలికొదిలిన ఆర్థికశాఖ
- కేసీఆర్ హయాంలో నెలలోపే బిల్లుల మంజూరు

**అలా..**

నల్లగొండ జిల్లాకు చెందిన కొంత మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లు చెక్కును జడ్పీ నుంచి ఆర్థికశాఖకు పంపారు. రూ.1.58 కోట్ల మొత్తంతో గత ఏడాది డిసెంబర్‌లో ఈ చెక్కును పంపగా ఇప్పటివరకు ఆర్థికశాఖ నుంచి నిధులు విడుదల కాలేదు.

**ఇలా..**

ఇదే జిల్లాకు చెందిన మరికొంతమంది ఉపాధ్యాయుల జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లుకు సంబంధించిన మరో చెక్కును కూడా ఇటీవలే జడ్పీ నుంచి ఆర్థికశాఖకు చేరింది. ఈ చెక్కు విలువ రూ.2.95 కోట్లు. రోజుల వ్యవధిలోనే దీనికి ఆర్థికశాఖ నిధులు విడుదల చేసింది. గత జనవరిలో పంపిన మరో చెక్కుకు కూడా రెండు రోజుల కిందట ఆర్థికశాఖ నిధులు విడుదల చేసింది.

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అన్నం ఉడికిందనేందుకు ఒక్క మెతుకు పట్టుకుంటే చాలు. అట్లనే రాష్ట్ర ఆర్థిక శాఖలో ఏం జరుగుతుందనేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు. కాంట్రాక్టర్ల బిల్లులే కాదు.. చివరకు ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి హక్కుభుక్తంగా రావాల్సిన మొత్తాల నిధులు విడుదల చేసేందుకూ ఆర్థికశాఖలో దందా కొనసాగుతున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెయ్యి తడిపితే తప్ప నిధులు విడుదల కావటం లేదంటూ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల జీపీఎఫ్ మొత్తం సర్కారు వద్దే ఉంటుంది. ఇందులో పదవీవిరమణ పొందినవారు, సర్వీసులో ఉండి చనిపోయినవారితో పాటు 20 ఏండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లుల కోసం దరఖాస్తు చేసుకుంటారు. వైద్య సదుపాయాలు, గృహ నిర్మాణాలు, వివాహాలు, పిల్లల చదువులు వంటి అత్యవసర అవసరాల కోసం జీపీఎఫ్ మొత్తంలోని 50 శాతాన్ని ఫైనల్ బిల్లుగా పొందేందుకు ఈ దరఖాస్తు చేసుకుంటారు. సంబంధిత డీడీవో (డిస్బర్సింగ్ డ్రాయింగ్ ఆఫీసర్) నుంచి ఉద్యోగుల వివరాలు జిల్లా పరిషత్తుకు వెళ్తాయి. అక్కడ ఒక్కొక్కరివి కాకుండా కొంతమంది ఉద్యోగుల జాబితాను రూపొందించి.. అందరికి సంబంధించిన మొత్తంతో చెక్‌ను రూపొందించి, ఆర్థికశాఖకు పంపుతారు. జిల్లాల నుంచి వచ్చిన చెక్కులను ప్రాధాన్య క్రమంలో తీసుకొని ఆర్థికశాఖ నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ, ఆ ప్రాధాన్య క్రమం క్రమం తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నల్లగొండ జిల్లా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లుల చెక్కులే నిదర్శనం. గత ఏడాది డిసెంబర్‌లో జడ్పీ నుంచి వచ్చిన చెక్‌ను కాదని, కొన్నిరోజుల కిందట వచ్చిన చెక్‌ను క్లియర్ చేయటం వెనుక మతలబు ఏమిటనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. పైగా తక్కువ మొత్తం ఉన్నందున త్వరగా క్లియర్ చేశామని సాకు చెప్పే అవకాశం కూడా లేదు. ఎందుకంటే గత డిసెంబర్‌లో పంపిన చెక్కు మొత్తం రూ.1.58 కోట్లు అయితే, ఇటీవల పంపిన చెక్ విలువ రూ.2.95 కోట్లు. అంటే.. దాదాపు రెట్టింపు. మరి.. తక్కువ మొత్తాన్ని కాదని, ప్రాధాన్య క్రమాన్ని విస్మరించి నిధులు విడుదల చేయటం వెనక జరుగుతున్న దందా ఏమిటి? అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

# వరద బాధితులకు ఉద్యోగుల బాసట

- ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని ప్రకటించిన జేఏసీ కమిటీలు
- మహబూబాబాద్‌లో సీఎంకు అంగీకార పత్రం అందజేత
- సెప్టెంబర్ నెల వేతనం నుంచి జమ చేయాలని వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి విరాళం అంగీకారపత్రాన్ని అందిస్తున్న ఉద్యోగ జేఏసీ సంఘాల నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు బాసటగా నిలిచారు. ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా ఇస్తామని ఉద్యోగుల జేఏసీ సంఘాలు మంగళవారం ప్రకటించాయి. హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో ఎంప్లాయీస్ జేఏసీ నేతలు అత్యవసరమై వరద బాధితుల సాయంపై చర్చించారు. 205 సంఘాలతో కూడిన జేఏసీ పక్షాన రూ.130 కోట్లను సీఎం సహాయనిధికి జమచేయాలని తీర్మానించారు. ఆ తర్వాత మహబూబాబాద్‌కు వెళ్లిన జేఏసీ నేతలు అక్కడి జిల్లా కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ అంగీకారపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఒక రోజు మూలవేతనాన్ని సెప్టెంబర్ నెల జీతం నుంచి ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని కోరారు. ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు, శ్రీపాల్‌రెడ్డి, సదానందంగౌడ్, మధుసూదన్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, చంద్రశేఖర్ గౌడ్, రవీందర్‌రెడ్డి, రవి, మణిపాల్‌రెడ్డి, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఉద్యోగుల సమిష్టి నిర్ణయం: జేఏసీ చైర్మన్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వరద బాధితులకు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పక్షాన రూ.100 కోట్ల విరాళాన్నిస్తున్నట్టు జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి జేఏసీ పక్షాన ఉద్యోగుల అంగీకారపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగుల తరఫున సమష్టిగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తమ వంతుగా ప్రభుత్వానికి ఆర్థికంగా చేయూతనివ్వాలని భావించినట్టు లచ్చిరెడ్డి తెలిపారు.

# విరాళం ప్రకటనపై ఉద్యోగుల్లో అసహనం

- బహిరంగంగా అసంతృప్తి వ్యక్తంచేసిన ఉద్యోగులు
- ఎవరినడిగి వరద సాయం ప్రకటించారంటూ ఫైర్
- పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌ల సంగతేంటని ప్రశ్న
- సోషల్ మీడియాలో ఉద్యోగ సంఘాలపై ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వరద బాధితులను ఆదుకునేందుకు ఒక రోజు మూలవేతనాన్ని విరాళంగా ఇస్తామంటూ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జేఏసీలు పోటీపడి ప్రకటించడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగ సంఘాల తీరును ఉద్యోగులు సోషల్ మీడియా వేదికగా ఎండగట్టారు. బహిరంగంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఉద్యోగ సంఘాలు జేఏసీలు పోటీపడి విరాళాలు ప్రకటించాయి. ఒక జేఏసీ రూ.130 కోట్లు, మరో జేఏసీ రూ.100 కోట్లు విరాళమిస్తామంటూ ముఖ్యమంత్రికి, సీఎస్‌కు అంగీకార పత్రాలను అందజేశాయి. దీనిని కొంత మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తప్పుపడుతున్నారు. తమను సంప్రదించకుండా, అభిప్రాయం సేకరించకుండా ఇలా ఏకపక్షంగా ఎలా ప్రకటన చేస్తారని సోషల్‌మీడియాలో ఫైర్ అయ్యారు. డీఏ బకాయిలు విడుదల చేయించలేదు. సరెండర్‌లీవుల బిల్లులు ఇప్పించలేదు. పీఆర్సీ గురించి అడగరు.. కానీ ఎవరు అడిగారని ఒకరోజు వేతనం ఇస్తామని ఒప్పుకున్నారని మండిపడ్డారు. రెండు నెలల క్రితం బదిలీ అయిన ఉద్యోగులకు సగం నెల వేతనం ఇంకా ఇవ్వనేలేదని పేర్కొన్నారు. ఎవరి మెప్పు కోసం మమ్మల్ని బలిపశువులను చేస్తున్నారంటూ తిరుగుబాటు చేశారు. కొందరు ఉద్యోగ సంఘాల నేతలకు ఫోన్లు చేసి నీలదీసినంత పనిచేశారు. సహాయమనేది వ్యక్తిగతమని. ఎంత ఇవ్వాలని చెప్పడానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు. 'విరాళం ప్రకటించడానికి ముందు ప్రాథమికంగా సభ్యుల అభిప్రాయం తీసుకోవాలి. అంతా నాయకులు ఇష్టమేనా.. ఎదుటి వాళ్ల జీతం మీద మీకు ఏం హక్కు ఉంది?' అంటూ ఓ ఉద్యోగి సోషల్‌మీడియాలో తన అసంతృప్తిని వెల్లగక్కారు.

### సోషల్ మీడియాలో ఉద్యోగుల అసంతృప్తి..

- ప్రస్తుతం ఉద్యోగ సంఘాలు పోటీపడుతున్నాయి. జేఏసీలుగా ఏర్పడ్డాయి. ఎందుకో తెలుసా. ప్రభుత్వం దృష్టిలో పడటానికి. ఉద్యోగుల ప్రయోజనాల కోసం పోరాటాలు చేయాల్సిన సంఘాలు.. ఒకరిని మించి మరొకరు తామంటే తామే విధేయులమని చాటుకోవడానికి తాపత్రయపడుతున్నాయి.
- మేం విరాళం ఇవ్వం గాక ఇవ్వం. మేం లెటర్ స్వచ్ఛందంగా ఇస్తే ఒక రోజు వేతనం కట్‌చేయండి. లేకపోతే మా అభిప్రాయం లేకుండా వేతనం కట్‌చేస్తే ప్రజాస్వామ్యమనిపించుకోదు.
- ఏ సంఘ నాయకులు సంతకాలు చేశారో.. ప్రభుత్వాన్ని కలిశారో వాళ్ల ఒక్క రోజు జీతాన్ని కట్‌చేయాలి. సంఘాల్లో లేని వాళ్లవి ఎలా కట్ చేస్తారు. అలా చేస్తే ధర్నాలు, రాస్తారోకోలు, నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలుపుతాం.
- కత్తికి లేని దురద పీటకు ఎందుకో.. ముందు రాజకీయ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పోస్టుల్లోని వారు, సెలబ్రిటీలు విరాళాలు ఇస్తున్నట్టు ప్రకటన చేయాలి. ప్రజా ప్రతినిధులకు లేని ఔదార్యం ఉద్యోగులకెందుకు?
- వరద బాధితులకు ఒక రోజు మూలవేతనం సరే.. అలాగే పెండింగ్‌లోని నాలుగు డీఏలు ఇప్పిస్తున్నామని ఒక స్టేట్‌మెంట్ కూడా ఇప్పించండి. కనీసం రెండు డీఏలైనా ఇప్పించండి. పెండింగ్ బిల్లులు మంజూరు చేయించండి.